కథా నిలయం
శ్రీకాకుళం



# రెండో రిటైర్‌మెంట్

సాధారణంగా రిటైర్‌మెంట్‌నాడు జరిగే వీడ్కోలుసభ అందరివలెనే రామజోగయ్యకూ ఏర్పాటయింది. అందరూ పాల్గొన్నారు. చేసిన సేవలు పొగిడినవారే ఎక్కువ. దానికి వుల్లాసపూరితుడే అయినాడు. వయస్సులో పిన్నయినా హోదాలో పెద్దయిన శివరాజ్ రామజోగయ్యను ఉచితరీతిన సత్కరించాడు.

అప్పుడు ప్రారంభించాడండీ! అసలు సిసలు అత్తెసరు ప్రసంగం, "అయ్యా! ఈరోజు సుదినం అనాలో, దుర్దినం అనాలో తెలీడం లేదు. సుదినం అంటే రామజోగయ్యగారు బాధపడతారు. దుర్దినం అంటే మీరంతా బాధపడాలి. ఎందుకంటే గుండ్రాయిలా వుండే ఆయనకేమొచ్చిందీ దుర్దినం అనటానికి అని. అయినప్పటికీ నేనొకటంటాను. ఏంటంటే.. రామజోగయ్యగారే కాదు ప్రతీవారు ఏదోనాటికి సర్వీసునుండి రిటైర్ కావలసిందే! అయితే పైవారికీ మనకీ తేడా ఏంటంటే.. మనం ఉద్యోగస్తులం రెండు రిటైర్మెంట్లు ఎదుర్కోవాలి. మొదటిది వృత్తినుండి.. ఆనాటినుండి ఇంక రెండో రిటైర్మెంట్.." అని ఆగాడు శివరాజ్.

అందరి ముఖాల్లో సంభ్రమాశ్చర్యాలు.

"అదేనండీ... రెండో రిటైర్మెంట్ అంటే జీవితం నుండి నిష్క్రమణ. రిటైర్మెంటు

తేదీ ప్రభుత్వం రాసినట్టే. మన తుదిశ్వాస తేదీకూడా దేవుడు ఖరారు చేసే వుంటాడు. ఇంక మన రామజోగయ్యగారు ఆరోజు కోసం ఎదురుచూస్తూ కృష్ణా రామా అనుకుంటూ గడపటమే".

అన్నమాటల్లో నిష్కపటమే వున్నా ప్రతి వారికి అందులోని వ్యంగ్యం కర్ర విరిచి పొయ్యిలో పెట్టిన చందంగా ప్రతిబింబించింది.

తరువాత రామజోగయ్య ఎలా నిలుచున్నాడో, ఏం మాట్లాడాడో కూడా తెలీని అయోమయం చుట్టుముట్టింది. అలా రిటైరై మూడేళ్లు గడిచిపోయినప్పటికీ శివరాజ్ ప్రసంగం మాత్రం మనసు అట్టడుగు పొరలలో స్థాపించుకుపోయింది.

అతని మాటల్లో భాష్యం వెతుక్కున్న ప్రతిక్షణం రామజోగయ్య. హృది బాధగా మూలిగేది.

రిటైరైన ప్రారంభంలో పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకంటే కొడుకులిద్దరికీ ఉద్యోగాలు తెప్పించేసరికి, ఒక్క కూతురు పెండ్లికి అల్లుడిని వెతికేసరికి అవి వ్యాపకాలుగా మారి ఒంటరితనం హింసించలేదు.

మరికొంతకాలానికి కోడళ్ళు తమింట కాలు పెట్టడంతో కాలక్షేపం తోడయ్యింది.

అయితే ఇప్పుడిప్పుడే రామజోగయ్యకి వృత్తి నుండి విరమించిన లోటు స్పష్టంగా తెలియసాగింది. తనకంటే ముందే పోయిన భార్య ఈనాడు బ్రతికుంటే, రిటైరైన తనకి తోడుగా నిలిచేదని మాత్రం బాధించేది.

దయదలచి కొడుకులు మాత్రం తననేమీ నొప్పించటం లేదు. నిన్నమొన్న వచ్చిన కోడళ్లవైనం ఇంకా అవగాహనలోకి రాలేదు. తనకి కాలక్షేపంగా వుంటుందని పేపర్ తెప్పించుకుంటున్నాడు రామజోగయ్య.

ఏవేవో... వార్తలు... విశేషాలు.. ప్రపంచంలో విస్తరించిన అభివృద్ధికి పోటీపడుతూ ప్రచండ తాండవమాడే హింసాకాండ. అటువంటి వార్తలు చదువుతున్నప్పుడు భీతిగుండెలను రాపాడించేది. అంతేకాక అతని దృష్టి శ్రద్ధాంజలి, నిర్యాణాల ప్రకటనలపై నిలిచేది. చనిపోయిన వారి మీద ఎందుకో ప్రగాఢ సానుభూతి కలిగేది... ఆకస్మిక మరణాలయితే జాలిపాళ్లు మరిన్ని రెట్లు అధికమయ్యేది.

ఆరోజుదయం ఎప్పటిలాగే శ్రద్ధాంజలి ప్రకటనలపై చూపు ప్రసరించింది. బోళ్ల బుల్లిరామయ్యగారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ అతని కుటుంబ సభ్యుల ప్రకటన. జననం పది తొమ్మిది పందొమ్మిది వందల ముప్పై అయిదు మరణం ఆరు-పది-

తొంబయి అయిదు. అంటే అతని బ్రతుకు విలువ అరవై సంవత్సరాలన్నమాట. అలాగే మరో ప్రకటన. గుల్లిపల్లి కూర్మయ్యగారు జననం ఆరు, ఏడు ఇరవైతొమ్మిది మరణం.. ఏడు ఏడు తొంబయి అయిదు. అంటే అరవై ఆరు సంవత్సరాల ఆయుష్షు. ఇలా రామజోగయ్య తరచుగా అటువంటి ప్రకటనలతో బేరీజు చేసుకోవడం మొదలెట్టాడు. ఎట్నుంచి ఎటు చూసినా సరే మనిషి బ్రతుకు పరిధి డెబ్బై ఐదు సంవత్సరాలు మించడంలేదు.

తన వయస్సు ప్రస్తుతానికి అరవైనాలుగు. దీన్ని బట్టి తను మహా అయితే పదకొండు సంవత్సరాలలోపే చెల్లు చీటీ తీసుకుంటాడన్నమాట.

ఆ ఆలోచనకే గుండెల్లోకి గుడ్లగూబ వచ్చి రెక్కలు టపటపలాడించి అరిచినట్లు అయ్యేది. ఒకవేళ తను పోయాక తన కుటుంబ సభ్యులు కూడా ఇలా ప్రకటన ఇస్తారో లేదో... వెంటనే ఇచ్చినా ఇస్తారేమో కాని, సంవత్సరాల తరబడి మిమ్మల్ని మరువలేమంటూ ఇచ్చే ప్రకటనలను ఇవ్వటానికి తనంత గొప్ప పనులేం చేశాడు కనుక?

"ఏమండీ మామయ్యగారు! కాఫీ చల్లారిపోతోంది" అన్న పెద్దకోడలు సుదీప్తి పిలుపుకి వులిక్కిపడి కాఫీ అందుకున్నాడు. చేదంటే చేదుకాదు అలాంటి అనుభూతి.

పెరటిలోకి వెళుతుంటే - "అబ్బ! మామగారు మరీ ఇంటికూచిలా వున్నారు. మనం సరదాగా ఏ విషయం మాట్లాడుకోవాలనుకున్నాసరే ఈయనొకరు. రిటైరైనాక ఆధ్యాత్మిక చింతనయినా లేదు. పోనీ అలా మూడు కోవెళ్లకు వెళ్ళకూడదూ! సదానందస్వామి ప్రసంగాలౌతున్నాయి" తోటి కోడలుతో అంటోంది స్రవంతి.

వాళ్ళన్నది నిజమే అనిపించింది రామజోగయ్యకు. తను ఇటీవలి కాలంలో గుమ్మం దాటటంలేదు. అసలు తనింక ఏ విషయం మనసులో పెట్టుకోక దైవచింతనపై దృష్టి సారించాలి.

అనుకున్న నిముషాన్నే గుడికి ఆయత్తమైనాడు.

వయస్సుమీరిన శాల్తీలు భక్తప్రపంచంగా మారారు.

రామజోగయ్య మండపంలో ఓ స్తంభానికి చేరబడి కూర్చున్నాడు.

"మృత్యువుకి ప్రపంచంలోని వాళ్ళంతా సమానమే. అది చెప్పి రాదు. తన రాక ఫలానా సమయమని. ఇలా వుంటుందని తెలియనివ్వదు. అంతా భగవల్లీల.. దానికి రాజైనా పేదైనా ఒక్కటే! వయస్సుతో నిమిత్తం లేదు. ఇన్ని అద్భుతాలను కనిపెట్టినా, మానవునికి సాధ్యంకాని విషయం మృత్యువుని జయించటం. అదే

సాధించగలిగితే ఈ మానవుడికి పట్టపగ్గాలుండేవా? అందుకే ఆ జగన్మోహనాకారుడు తన దగ్గర నిగూఢమైన ఆ రహస్యాన్ని దాచి మానవుడిని గుప్పెట్లో బంధించాడు. చెప్పొచ్చేదేమంటే ఈ బుద్బుదప్రాయ జీవితం గురించి, నవరంధ్రాల తోలుతిత్తి గురించి ఆలోచిస్తూ గడిపేకంటే పరమార్థ సాధనలో జీవించటమే నిజమైన జీవితం. అంతేకాని ఏ మిషతోనైనా వచ్చే మృత్యువు కోసం ఎదురు చూడ్డం కాదు" ఇంకా ప్రసంగప్రవాహం కొనసాగుతూనేవుంది.

అందులో వేదాంతం బోలెడున్నాసరే ఒంటబట్టించుకున్నది మాత్రం ఒకేఒక్క విషయం ఏ మిషతోనైనా మృత్యువు రావచ్చన్నది. అంటే ఈ అంతిమకాలంలో ఆరోగ్యానారోగ్యాల సంబంధం లేకుండా మృత్యువు పిలుస్తుందా?

ఆ తలంపే భయానకమనిపించింది రామజోగయ్యకి. ఉపన్యాసం పూర్తయినాక ఇంటివైపు నడవసాగాడు. కోట దగ్గర పెద్ద ఎత్తున జనం మూగారు.

ఆత్రుతగా దగ్గరకెళ్లాడు రామజోగయ్య. "అయ్యో రామ రామ! ఎవరో కాని ఇనుములా వున్నాడు. నడుస్తూనే చతికిల పడిపోయాడు. పైగా జేబులో అడ్రసు ముక్కయినా లేదు. అందుకే బైటికి వెళ్లేటప్పుడు అడ్రసు కాగితం ఒకటి జేబులో వుంచాలని ఇంట్లోవారికి తెలియాలి" ఎవరిదో ముందు జాగ్రత్త వ్యాఖ్యానం.

చూడబోతే ఉక్కుముక్కలా వున్నాడు. కాని మరణమేమో ఇలా నడిరోడ్డు మీద సంభవించింది. ఆ క్షణంలోనే సదానందస్వామీజీ ప్రవచనాలు సత్యమై మారుమ్రోగాయి రామజోగయ్య చెవుల్లో.

ఇంటికి వెళ్ళీవెళ్ళగానే ఓ అడ్రసు కాగితం జేబులో ఉంచుకున్న దాకా గుండె గుబులు తగ్గలేదు. అది మొదలు చొక్కా మారినప్పుడల్లా అడ్రసు కాగితం అందులోకి మార్చుకొనేవాడు.

ఓసారి మామగారి చేష్టకి స్రవంతి పడీపడీ నవ్వింది. తన బెంగ, దిగులు వారికి చాదస్తంగా కనిపిస్తున్నాయి కాబోలు... అనుకున్నాడు రామజోగయ్య.

రోజులు అందరికీ ఎలా గడిచినా అతనికి మాత్రం నరకప్రాయమే.

ఒకరోజు రామజోగయ్యకు బజార్లో మిత్రుడు గంగారావు కనిపించాడు. తన కంటే బాగా కృశించిపోయిన అతన్ని చూస్తూనే జాలిపడ్డాడు.

"ప్రతీ ఆర్నెల్లకోసారి మెడికల్ చెకప్ చేసుకోవటం ఈ వృద్ధాప్యంలో అవసరమని కొడుకులంటే నేనే కొట్టిపారేశాను. ఫలితం అనుభవిస్తున్నాను. ఈ కాలంలోనే సుగర్,

బి.పి. రెండూ భూతాల్లా మీద పడి కబళించటానికి రెడీగా వుంటాయి. హార్ట్, లంగ్స్ చెకప్ సరేసరి... ఇదిగో యిన్ని మందులూ మింగాలి... వస్తా" అని రిక్షాలో వెళ్ళిపోయాడు.

కలచిన మనసుతో విచలితుడైనాడు రామజోగయ్య.

తను రిటైరైనాక ఈ మధ్యకాలంలో వైద్యుడి జోలికి పోలేదు. తనెందుకింత కాలం అశ్రద్ధ చేశాడో అంతుపట్టడం లేదు. తనలో ఏ మూలో దాక్కున్న అనారోగ్యాలు ఒక్కసారి కలబడి కాటేయవుగదా!

పోనీ కొడుకులైనా మాట మాత్రంగా అనవచ్చుగదా. ఒకసారి చెకప్‌కి తీసుకెళ్తామని. అదే మాటంటే కొడుకు ఉదయ్ "నాన్నా మీకేమైనా పిచ్చా ఒంట్లో ఏదైనా నలత కనిపిస్తే చెకప్ అవసరం కాని లేక పోతే ఎందుకూ డబ్బు దండుగ.." అని విసుక్కుంటూనే డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళాడు.

బయటకు వచ్చాక "నేను మొదటే చెప్పానా! మీ భయమే తప్ప ఏమీ వుండదని. ఏదో మీ తృప్తికోసం ఈ టానిక్ రాశారు" అని మళ్ళీ ఓసారి విసుక్కున్నాడు.

తనకేమైనా వుంటే వుందని వాపోయేవాడు. ఇప్పుడు తనకేమీ లేదన్న చింత పట్టుకుంది. అంటే ప్రస్తుతానికి అనారోగ్యపరంగా మృత్యువాత వుండదు.

కానీ సదానందస్వామిగారు చెప్పినట్లు దానికి దేనితో ప్రమేయం వుండదే. ఔను కదూ! ఏమీలేదని తెలిపిన పద్దా లాభం లేదు.

రామజోగయ్య గుండె బితుకు బితుగ్గా కొట్టుకులాడసాగింది. మరికొంతకాలం సాగింది.

"నాన్నగారూ! నాన్నగారూ... మనం తుపాకుల వీధిలో వుండేటప్పుడు రంగస్వామిగారని వుండేవారే! ఆయన పోయారుట" చిన్న కొడుకు వసంత్ చెప్పాడు.

"ఎలారా? జబ్బుపడ్డారా?" ఆసక్తిగా అడిగాడు రామజోగయ్య.

"అబ్బే! అదేంలేదు. నిన్న రాత్రి పాలు త్రాగి పడుకున్నారుట. నిద్రలోనే ప్రాణం పోయిందట. పాపం !" నిట్టూర్చాడు వసంత్.

రామజోగయ్య మ్రాన్పడిపోయాడు. రంగస్వామి కోడిరామ్మూర్తి పార్కులో వ్యాయామం చేసిన మంచి దిట్ట. కుస్తీ పోటీల్లో ఎటువంటి వారినైనా మట్టికరిపించే వాడు. అటువంటి వాడిని నిద్రలోనే మృత్యువు కాటేసిందా?

అంటే నిద్ర కూడా మనిషికి శత్రువన్నమాట.

ఆయుర్వేదగ్రంథాలు నిద్రను అర్థమరణంగా వర్ణించాయి. అదే శాశ్వత

నిద్రఅయిననవాడు..?

తదాదిగా రామజోగయ్యలో అనవసర ఆందోళన వ్యాప్తి చెందింది.

పగటినిద్ర మానుకున్నాడు. ఆ సమయంలో పుస్తకాలు చదువుతూ గడిపేసేవాడు.

పొద్దుపోయిన ఛాయలు పాకటంతోనే అదొకవిధమైన బెంగ ఆవహించేది.

అన్యమనస్కంగా భోజనం కానిచ్చేవాడు. ఒకపట్టాన పడకమీద చేరకుండా పచార్లు చేయసాగాడు.

"కొత్తగా పచార్లు మొదలెట్టారేమిటి నాన్నా! పడకెక్కి హాయిగా పడుకోక..." అని ఉదయ్ దెబ్బలాడాడోసారి.

పడుకుంటే హాయి ఎక్కడిది? వెధవ బెంగొకటి తినేస్తుంటే... అనుకున్నప్పటికీ మరొకరిని చిరాకు పరచనిష్టంలేక పడక చేరాడు.

నిద్రకోసం ప్రయత్నించేవాడు. కళ్లు పత్తికాయల్లా విచ్చుకోవటం తప్పితే కన్నుమూసిన పాపాన పోలేదు. ఒకప్పుడు నిద్రతో కళ్లు వాలినా హఠాత్తుగా మధ్యలో తెలివివచ్చేది. గభాలున పైకి లేచి కూర్చుని తను ఈ లోకంలో వున్నట్లుగా ఉనికిని స్పష్టపరచుకునేవాడు.

ఇలా చాలాసార్లు జరిగింది.

కొంతకాలానికి రామజోగయ్యలో నిద్రలేమి ప్రభావం కొట్టొచ్చినట్లు ప్రతిఫలించింది. కళ్ళకింద నల్లవలయాలు కట్టాయి. నీరసం నీలినీడలా ప్రాకింది.

తండ్రి అవస్థలు కనిపెట్టిన వసంత్. అతన్ని డాక్టర్‌కి చూపించాడు.

"మానసికపరమైన టెన్షన్ ఎక్కువైంద"ని ఏవో మందులు వ్రాసిచ్చాడు డాక్టర్.

★★★

"రామజోగయ్యా! రామజోగయ్యా" చిత్ర గుప్తుడు పెద్ద చిట్టాపుస్తకం తెరచి పెద్దపట్టున పిలిచాడు.

మహిషారూఢుడైన యమధర్మరాజు "జీవిని ప్రవేశపెట్టండి" అనగానే ఇద్దరు యమభటులు రామజోగయ్యని రెక్కలు పట్టి బోనులోకి తీసుకొచ్చారు.

"చిత్ర గుప్తా! ఈ మూర్ఖుడు చేసిన నేరమేమి?" ప్రశ్నించాడు యముడు.

"తన దగ్గరకు పెన్షన్ ఫైలుమీద సంతకంకని వచ్చిన సన్యాసిరావు అనే అతన్ని లంచం ఇవ్వలేదన్న కక్షతో ముప్పుతిప్పలు పెట్టి నానా ఇబ్బందులకూ గురిచేశాడు.

అంతేకాదు తన దగ్గర అసిస్టెంటుగా చేరిన జ్యోతి అనే అమ్మాయిని డిక్టేషన్‌కని పిలిచి బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు. అది చూసి ఆమె బావ అపార్థం చేసుకొని జ్యోతిని వివాహం చేసుకోకుండా బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. అప్పటినుండీ జ్యోతి అవివాహితగా వుండిపోయింది. ఇతనికి శిక్ష..." అని యమధర్మరాజు కళ్లల్లోకి చూశాడు.

"ఈ నరాధముడిని మరిగే నూనెలో పడవైచి, ఆనక ఉప్పుకారంలో వేయించి తదుపరి పెనంమీద కాల్చివదలండి" అని ఆగాడు.

"అది మేస్టార్ని ఇబ్బందుల పాల్జేసినందుకు... మరి జ్యోతి జీవితంతో ఆడుకున్నందుకు శిక్ష.." చిత్రగుప్తుడు ప్రశ్నించాడు.

"తిరిగి జీవం పోసి విషసర్పాలచే పొడిపించి పర్వతాలపైనుండి పడవేయండి." అని యముడు ఆజ్ఞాపించాడు.

భటులు రామజోగయ్యను కుతకుతలాడే నూనెలో వేశారు. కెవ్వున కేక పెట్టాడు.

ఒక్కసారి పక్కమీద నుంచి అంతెత్తున ఎగిరిపడ్డాడు రామజోగయ్య.

"కలా?" ఎంత భయోత్పాతాన్ని కలిగించింది? తను చనిపోవటం... యముడు శిక్షలు వేయటం...ఎంత గగుర్పాటు కలిగించింది.

చెంబుడు నీళ్లు గడగడ త్రాగేశాడు.

నిద్రమాత్రల మూలంగా గాఢనిద్రలోకి జారుకున్నాడు. దాని ఫలితం పీడకల!

అంటే అనుభవించాల్సిన శిక్షలు కలరూపేణా దర్శనమిచ్చాయన్నమాట.

ఒక మాట మాత్రం నిజం! తను సర్వీసులో నున్నప్పుడు సన్యాసిరావు మేస్టారిని ఒక విధంగా, జ్యోతిని మరోవిధంగా దుఃఖ పెట్టిన మాట నిజం!

ఆ ఇద్దరికీ తను క్షమాపణ చెప్పి పశ్చాత్తాపపడి లెంపలేసుకుంటేగాని ప్రాయశ్చిత్తం లేదు. పాపానికి నిష్కృతి జరిగితే నరకంలో పడే శిక్షలలో కొంత మినహాయింపు వుండవచ్చు.

అందువల్ల తను పాపప్రక్షాళన నిమిత్తం వాళ్ళనిద్దరినీ కలిసే ప్రయత్నం చేయకతప్పదు.

తొలుత సన్యాసిరావు మేస్టారింటికి నడిచాడు. అతని కొడుకు సురేంద్ర రామజోగయ్య వివరాలు విని – "మీరా! ఆ మహానుభావులు.. మా నాన్నగారిని మంచానపడేలా చేసింది. మీ పుణ్యం వల్లనే ఆయన పెన్షన్ కళ్లచూడకుండా కాలం చేశారు. ఛ... సిగ్గులేదు. గుర్తుచేసి మరీ కలియడానికి. మా నాన్నగారి ఉసురు

తగలకమానదు" అని తీవ్రంగా తూలనాడాడు.

ఇంకోక్షణం వుంటే కుర్చీలోంచి లేపేలా వున్నాడు.

ప్రాయశ్చిత్తంమాట దేవుడెరుగు! చావుతప్పి కన్ను లొట్టపోయినట్లయింది. పైగా తండ్రి ఉసురు తగలాలని శపించాడు. దాని మూలంగా తన పాపం పాలు పదిరెట్లు పెరగదుకదా! ఆలోచిస్తూ జ్యోతి ఆఫీసుకి వెళ్ళాడు. వాలంటరీ రిటైర్మెంటు పెట్టి రామతీర్థంలో వుంటోందంటే అక్కడికీ వెళ్ళాడు.

రామజోగయ్యను పోల్చి ఇంట్లోకి అడుగుపెట్టకుండానే. "పాపాత్ముడా! నీకక్కుర్తి కోసం నా జీవితంతో ఆటలాడావు... నువ్వు చేసిన నేరానికి నేను శిక్ష అనుభవిస్తున్నాను. పెళ్ళి కావలసిన ఆడదాని జీవితం అధోగతి పాలు చేశావు. కుళ్ళి కుళ్ళి చస్తావు ఇదే నా శాపం" కసిదీరా కేకవేసింది జ్యోతి.

తండ్రి ఉసురు తప్పక తగులుతుందని మేస్టారి కొడుకు, కుళ్ళి కుళ్ళి చావాలని జ్యోతి శాపనార్థాలు పెట్టారు. తానొకటి తలిస్తే దైవమొకటి తలవటం ఇదే కాబోలు... అనంతమైన వ్యథ పేరుకుపోయింది రామజోగయ్యలో... ఆ సమయంలో కొడుకులు, కోడళ్ళు యాత్రలకని అన్నవరం, సింహాచలం బయలుదేరారు.

ఇంటికి కాపలా రామజోగయ్య.

ఒంటరితనం ప్రత్యక్ష నరకమైంది.

గ్యాసు వెలిగిస్తుంటే – అది పేలి తను కాలిపోదుకదా అనిపించేది. పంకాకింద పడుక్కుంటే మీద పడి చావదు కదా అనుకున్నాడు.

క్షణక్షణం... భయం భయం.

అయినా వాళ్ళకి బుద్ధి వుండొద్దూ! ఓ ముసలాడిని ఒంటరిగా వదిలి వెళ్ళకూడదని. ఓ దొంగ దిగితే తన కాపలా ఏం పనిచేస్తుందని?

తనకు ఆకస్మాత్తుగా ఏ గుండెపోటో, పక్ష వాతమో వచ్చి మరణిస్తే... వాళ్లు యాత్రల నుండి తిరిగి వచ్చేసరికి కుళ్ళిన శవం కనిపిస్తుంది. జ్యోతి కోరిన హీనమైన చావు అదే కావచ్చు.

అలా తలచుకున్న క్షణాన్నే భయంతో వెన్నులో వణుకు పుట్టింది. అందుకనే తన కుర్చీ వీధిసావిట్లోకి మార్చుకున్నాడు. ఒకవేళ తనిలా కాలం చేసినా వీధిజనాలకయినా తెలిసే అవకాశం వుంటుంది.

అనకూడదుగాని మళ్ళా యాత్రలనుండి అందరూ తిరిగి వచ్చేదాకా

వీధిసావిట్లోనే ఎక్కువ కాలం గడిపాడు రామజోగయ్య.... భయం ఊబిలో కూరుకుపోతూ!

ఒకసారి ఎవరో చెప్పారు "సనత్‌కుమార్ బాబా భవిష్యకాలం గురించి బాగా చెబుతారని..." అతన్ని కలవాలన్న ఉత్సుకత బయలుదేరింది రామజోగయ్యలో.

"మీకు రాబోయేది ఆపదకాలం...ఏలినాటి శని ప్రభావం మిక్కుటంగా వుంది. ఈ అంత్యకాలమందు మనిషి అంతుచూసి గాని వదలదు. ఏకొద్దిమందికో మేలుచేస్తుంది తప్ప" అని చెప్పి ఏదో విభూతి ఇచ్చి రాత్రుళ్లు పెట్టుకోమన్నాడు.

ఉత్ప్రేరకంగా పనిచేశాయా మాటలు. ఘర్షణ అంటే ఘర్షణ కాదు.

ఈ వృద్ధాప్యం మూలిగే నక్కమీద ఏలినాటి శని తాటిపండు నెత్తిమీదనే కాచుకున్నది.

ఆ రోజు మొదలు 'హతవిధీ' అనుకుని బ్రతకసాగాడు రామజోగయ్య.

ప్రొద్దుటే పేపర్ తెరిచి నిర్యాణాల జాబితా చూస్తూ జననమరణాల లెక్కలు చూస్తూ గడుపుతాడు. క్షణానికోసారి ఉలిక్కిపడ్డం మామూలయిపోయింది. జపం, తపం అంటూ ఘడియకో స్తోత్రం చదువుతున్నాడు.

ఆ సమయంలోనే కూతురు, అల్లుడు దిగారు. వాళ్ళిద్దరూ రామజోగయ్య అవతారం చూస్తూనే చిత్తరువులైనారు. చీపురుపుల్ల మాదిరిగా మారిన తండ్రిని చూసి అన్నదమ్ములతో తగువాడింది లలిత.

"నాన్న మీద నీ కొక్కతికే ప్రేమ, జాలి కదూ! ఆయన్ని మేమేం చులకనగా చూడ్డంలేదు. ఆయనకి చాదస్తం ఎక్కువయిపోయింది. అయినదానికీ, కానిదానికీ బెంగటిల్లిపోతున్నారు. ఒంట్లో ఏం లేదన్నా, వుందనే భావం. ఆయన త్వరలో పోతారుట. అప్పుడే అప్పగింతలు ప్రారంభించారు. ఆయన్ని డబ్బు చూసి ప్రేమిస్తున్నామంటావా! ఈయనతో పాటు రిటైరైనవార్ని చూడు హాయిగా మనవలతో కాలక్షేపం చేస్తూ గడుపుతున్నారు. మరి ఈయనకే మైంది కృంగిపోవటానికి" అని తిరిగి చెల్లిని సాధించారు.

ఆడపడుచుమీద తడాఖా చూపించారు వదినలు. లలిత వెళ్ళిపోయినాక రామజోగయ్య పరిస్థితి అధ్వాన్నమైపోయింది. తనే ఉత్తరం వ్రాసి కూతురుని రప్పించినట్లుగా వారి అనుమానం. అందుకే కాబోలు మునుపటిలా ప్రవర్తించడం లేదనిపించింది.

దాంతో నిష్క్రియుడైన రామ జోగయ్య ఆత్మ చేసే నిర్విరామ రణగొణధ్వనిలో కొట్టుకులాడాడు.

అటువంటి స్థితిలోనే రామజోగయ్యతో రిటైరైన నీలకంఠం మరణించాడు. విషయం తెలిసి వెళ్లాడేగాని గుండె టకటకలాడిపోయింది.

ఆ ఇంటిముందర పెద్దలంతా ప్రోగయినారు.

శవానికిపాడె సిద్ధం అయింది.

తన మిత్రుడి మరణం కళ్ళారా చూసిన రామజోగయ్య కంటనీరూరింది.

నీలకంఠం అయినవాళ్ళంతా వచ్చారు. పరిచయస్తులంతా చేరారు. అతనితో వారి అనుబంధానికి సాక్ష్యాలు వారి కంటినుండి జాలువారిన కన్నీళ్లే.

"బతికినంత కాలం ఎవరినీ నొప్పించలేదు.

"అజాతశత్రువు. సర్వీసులో ఎంత పేరు తెచ్చుకున్నాడో.. రిటైరైన తర్వాత కూడా తన మంచితనంతో కుటుంబంలో ఏ కలతలకి ఆస్కారం లేకుండా, పరిష్కార భావంతో ప్రవర్తించి అందరికీ ఓ వెలుగు చూపించి చివరికి ఎవరిచేతా చేయించుకోకుండా ప్రశాంతంగా కన్నుమూశాడు" అని అతని అనుయాయులు అనుకోసాగారు.

"కోడళ్లను కూడా కూతుళ్లలాగే ప్రేమించి అందరిపట్ల ఒకే ప్రేమను కురిపించిన దేముడు.. జన్మజన్మలూ "మరువలేని మనిషి"

మాటల్లో రూఢిగా కోడళ్ల ప్రేమానురాగాలు.

"ఓసారి నా గుడిసెకి నిప్పంటుకుంటే ఈ బాబే తిరిగి గుడిసేస్కునుండమని ఓ ఎయ్యి రూపాయలు ఇచ్చినారు. తిరిగివ్వబోతే దెబ్బలాడి అప్పుగా ఇచ్చినాన్లే' అన్నారు. మహానుభావులు" ఇంటి పనిమనిషి గాఢంగా నిట్టూర్చింది.

అక్కడ సానుభూతి మాటలకి కొదువలేదు. పొగడ్తలకి పరిమితిలేదు.

నీలకంఠం సంపాదన మంచితనం...మానవత్వమున్న మనిషిగా కీర్తి.

అదే బ్రతుకు ముగిసిపోయినా మిగిలే వుండే దివ్యాభరణాలు.

అతనేకాదు. ఈ ప్రపంచంలో ఎందరో చక్రవర్తులు రంగరంగ వైభోగాలను అనుభవించి గతించి పోయినారు. మిగిలింది వారి చరిత్ర. గొప్ప గొప్ప మేధావులు మట్టిలో కలిసిపోయారు. మిగిలింది వారి మేధస్సు. గ్రహింపుకొచ్చి అనుభవసారం రామజోగయ్యలో నాటుకుంది. బ్రతికినంతకాలం చనిపోయాక కూడా మనిషిగా చెప్పుకునేలా బ్రతకాలి.

ఎవరు ఎలా మరణించారు? వారి ఆయుష్షు ఎంత?? అని కాదు బేరీజు వేసుకోవలసింది.

కానీ తను చేసిందేమిటి? వ్యర్థ పుటాలోచనలతో తన కార్యక్రమ సరళి విసుగెత్తించేలా ప్రవర్తించాడు. ఉన్నవారికి భారమైనట్లు కనిపించాడు.

ప్రతిజీవికి నిష్క్రమణ అనివార్యమే కాదు. అవసరం కూడా. అన్నీ తెలిసిన తను మృత్యుభీతితో. అనేక అపోహలను ఏర్పరచుకుని అందరి అభిమానాన్ని, ఆప్యాయతనూ పంచుకుంటూ, మంచి విలువను, కీర్తిని పెంచుకుంటూ గడపవలసిన అమూల్యమైన సమయాన్ని వృథా చేశాడు.

తన ముగింపు ప్రస్థానంలోగా అందరికీ కావలసినవాడిగా గణింపబడలేదు.

మరిన్ని కన్నీళ్ళు రాలాయి రామజోగయ్యకి.

నీలకంఠం మరణం అతని ఆత్మావలోకనానికి ప్రతిబింబమైంది. అప్పుడు అతనిలో ఓ ధ్రువతారలాంటి అభిప్రాయం ప్రాణప్రతిష్ఠ చేసుకుంది.

అది ఈ మిగతాకాలమైనా అందరితో ఆప్యాయతానురాగాలు పంచుకుంటూ ప్రశాంతంగా గడపాలని.

ఆ యోచన రామజోగయ్యను ఆనందపరిధిలో వుంచగలిగింది.

(విపుల మాస పత్రిక జూలై 1996)